సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 21 । మార్చి । 2024



టన్ను చీనీ రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23 వేలు పలికాయి. మార్కెట్‌కు 364 టన్నుల సరుకు వచ్చింది.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

గురువారం	శుక్రవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.34	సెహరీ : 5.09



న్యూస్‌రీల్

కౌంటింగ్ కేంద్రం కోసం ‘బిట్’ పరిశీలన



బిట్ కళాశాలలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

హిందూపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రం ఏర్పాటుకు మండల పరిధిలోని ‘బిట్’ ఇంజినీరింగ్ కళాశాలను బుధవారం కలెక్టర్ అరుణ్ బాబు పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి వచ్చిన కలెక్టర్... కళాశాల తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. హిందూపురం నియోజకవర్గంతో పాటు మడకశిర, పెనుకొండ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరచడంతో పాటు కౌంటింగ్ కేంద్రం ఏర్పాటుకు ‘బిట్’ కళాశాల అనువుగా ఉంటుందా.. అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, మండల సర్వేయర్ శ్రీనివాసులు, ఎన్నికల డీటీ రెడ్డి శేఖర్, ఆర్ఐ అమరేంద్ర, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఇంగ్లిష్ పరీక్షకు 594 మంది గైర్హాజరు



అమరాపురం కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కొత్తచెరువు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం 115 కేంద్రాల్లో నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు 594 మంది గైర్హాజరయ్యారని డీఈఓ మీనాక్షి తెలిపారు. మొత్తం 22,546 మంది విద్యార్థులకు గాను 21,952 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో వసతులన్నీ కల్పించడంతో పాటు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు..

ఈ నెల 1వ తేదీ ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. పరీక్షల నిర్వహణకు సహకరించిన వారందరికీ ఇంటర్ విద్య జిల్లా అధికారి రఘునాథరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ సంవత్సరం ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇంటర్ బోర్డు కార్యాలయానికి అనుసంధానం చేశామని, తద్వారా మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పోయిందన్నారు.

టీడీపీ ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయుడిపై వేటు

పుట్టపర్తి: టీడీపీ అభ్యర్థి తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బుక్కపట్నం మండలం నార్శింపల్లి తండాలో టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి మంగళవారం చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయుడు రామాంజినేయులు పాల్గొన్న విషయం తెలిసిందే. మండలంలోని కంబాలపర్తి గ్రామ పాఠశాలలో ఆయన ఎస్‌జీటీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఓ అభ్యర్థి తరఫున ప్రచారంలో పాల్గొన్నందుకు ఆయనను సస్పెండ్ చేస్తూ డీఈఓ మీనాక్షి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పట్టుబడిన రూ.8.20 లక్షలు



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న సీఐ శ్రీనివాసులు

హిందూపురం అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద రూ.8.20 లక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాత్రి బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న బత్తలపల్లికి చెందిన శంకరయ్యను అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అతని వద్ద ఎలాంటి రసీదులు లేకుండా రూ.8.20 లక్షలు ఉండడంతో సీజ్ చేసి, వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. హిందూపురంలోని తన ఇంటిని విక్రయించగా వచ్చిన డబ్బు తీసుకుని స్వగ్రామానికి వెళుతున్నట్లు ఈ సందర్భంగా సీఐ వి.శ్రీనివాసులు వద్ద శంకరయ్య వాపోయాడు. అయితే ఇందుకు సంబంధించిన ఆధారాలు చూపితే నగదు అప్పగిస్తామని సీఐ భరోసానిచ్చారు.



ఖాద్రీశుడి కల్యాణోత్సవ దృశ్యం



ఖాద్రీశుని కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కల్యాణ వైభోగమే

- కమనీయంగా ఖాద్రీశుని కల్యాణోత్సవం
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు
- ఆలయంలో మార్మోగిన గోవింద నామస్మరణ
- భక్తులతో పోటెత్తిన నృసింహాలయం

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా సాగింది. వసంత వల్లభుడిగా భక్తులు పిలుచుకునే ఖాద్రీశుడి కల్యాణం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. శ్రీవారి కల్యాణం సందర్భంగా ఆలయాన్ని, ప్రాంగణాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో విశేషంగా అలంకరించారు. నారసింహుడి కల్యాణం కనులారా వీక్షించేందుకు భక్తులు భారీగా తరలిరాగా, ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

పట్టువస్త్రాలు సమర్పించిన కలెక్టర్..

శ్రీవారి కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కలెక్టర్ అరుణ్‌బాబు శ్రీవారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకొచ్చారు. అంతకు మునుపు కలెక్టర్ ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. హిందూపురం పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్ దంపతులు,



బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

స్థానిక ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి దంపతులు శ్రీవారికి పట్టు వస్త్రాలు అందజేశారు. ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్ సీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంత, కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్, పార్టీ సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి దర్శనానంతరం శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఎప్పటిలాగే బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి భక్తులతో గోవింద నామస్మరణ చేయించారు.

పల్లకీపై వచ్చిన నారసింహుడు..

యాగశాల నుంచి నవ వధువులుగా అలంకృతులైన శ్రీదేవి, భూదేవిలతో పాటు వరుడు లక్ష్మీ నారసింహుడు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో పల్లకీపై మంగళ వాయిద్యాల మధ్య కల్యాణ మంటపం చేరుకున్నారు. అప్పటికే అక్కడ కిక్కిరిసిన భక్తజనం గోవింద నామస్మరణ చేయగా, ఆ ప్రాంతం శ్రీవారి నామంతో ప్రతిధ్వనించింది. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి విచ్చేసిన అర్చక పండితులు శ్రీవారి కల్యాణోత్సవ విశిష్టతను భక్తులకు అర్థమయ్యేలా వివరించారు. ముక్కోటి దేవతలు వీక్షించే స్వామివారి వివాహాన్ని సాక్షాత్తు బ్రహ్మదేవుడే ముందుండి జరిపిస్తున్నారని అర్చక పండితులు తెలిపారు. వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీవారికి ప్రతిరూపంగా విచ్చేసే కంకణ భట్టాచార్యులు మంగళ సూత్రాలను శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు అలంకరించారు. అనంతరం భక్తులందరికీ శ్రీవారి తలంబ్రాలు పంచిపెట్టారు. ఆనవాయితీలో భాగంగా భక్తులు స్వామివారికి చదివింపులు కూడా సమర్పించారు.

ధ్వజారోహణంతో సకల దేవతలకు ఆహ్వానం

నృసింహుని బ్రహ్మోత్సవాలను నలుదిక్కులా చాటేందుకు బుధవారం ఉదయం ఆలయం ముందున్న ధ్వజ స్తంభానికి అర్చకులు గరుడ దండాన్ని



శ్రీవారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ధ్వజారోహణం చేశారు. సకల దేవతలకు ఇదే శ్రీవారి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక..అని ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. ఏప్రిల్ 1న జరగనున్న తీర్థవాది ఉత్సవం రోజు శ్రీవారి చక్రస్నానం అనంతరం ఈ గరుడ దండాన్ని అవరోహణం చేస్తారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ధ్వజారోహనాన్ని కదిరి ప్రాంతంలో ‘కంకణాలు కట్టడం’ అంటారు. ఈ కంకణాలు విప్పేవరకూ అంటే తీర్థవాది ముగిసే వరకూ నరసింహ స్వామి భక్తులెవ్వరూ మాంసాహారం ముట్టరు. తమ ఇళ్లలోని వారికి పెళ్లిళ్లు కూడా చేయరు. కదిరి నారసింహుడిని కులదైవంగా భావించే పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని భక్తులు కూడా ఈ పద్ధతిని పాటిస్తారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బోయ శాంత, కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ తదితరులు

నేడు హంస వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఖాద్రీశుడు హంసవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. భక్తజనుల గోవింద నామస్మరణల మధ్య శ్రీవారు తిరువీధుల గుండా విహరించనున్నారు.

23 నుంచి రొళ్ల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

- 30న భూతప్పల ఉత్సవం
- వేలాదిగా తరలిరానున్న భక్తులు



లక్ష్మీనరసింహస్వామి మూల విరాట్

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 23వ తేదీ (శనివారం) నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకోసం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా మాఘ మాసం అనంతరం పాల్గుణ శుద్ధ త్రయోదశి రోజు నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో 23వ తేదీ అంకురార్పణ, 24న కళశ స్థాపన, కల్యాణోత్సవం, యోగీశ్వరాధన, 25న బ్రహ్మరథోత్సవం, 26న వసంతోత్సవం, రొళ్లకొండపై దివ్య జ్యోతి దర్శనం, 27న గరుడోత్సవం, 28న పూల పల్లకి ఉత్సవం, 29న దేవతా సంకీర్తన, 30న భూతప్ప సేవలు, తలనీలాలు సమర్పణ, 31న ప్రసాద వినియోగం, ముడుపుల ఉత్సవం, ఏప్రిల్ 1న మహామంగళ హారతి, ప్రసాద వినియోగం ఉంటాయి.

భూతప్పల ఉత్సవం ప్రత్యేకం..

రొళ్ల లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాల్లో భూతప్పల ఉత్సవానికి ప్రత్యేక స్థానం ఉంది. భూతప్ప కాలిస్పర్శతో సంతానభాగ్యం కలుగుతుందని, దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయని, పెళ్లి కాని యువతకు వెంటనే వివాహ యోగం ఉంటుందన్న నమ్మకంతో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఆ రోజు చన్నీటి స్నానం ఆచరించి తడి దుస్తులతో పిల్లలు, పెద్దలు భూతప్పల కాలిస్పర్శ కోసం రత్నగిరి రోడ్డులో వెలసిన ఈరముద్దమ్మదేవి ఆలయం నుంచి స్వామివారి ఆలయ ప్రాంగణం వరకూ రోడ్డుపై బోర్లా పడుకుంటారు.

టీడీపీ ‘క్యాష్’ పాలిటిక్స్

- డబ్బు సంచులతో వస్తేనే టికెట్
- బడాబాబులకు రెడ్ కార్పెట్ పరిచిన చంద్రబాబు
- అధినేత వైఖరిపై మండిపడుతోన్న తెలుగు తమ్ముళ్లు
- సీటు ఇచ్చేందుకు ఓ మాజీ ప్రజాప్రతినిధితో బాబు మంతనాలు
- కదిరి, పెనుకొండ నియోజకవర్గాలకూ సర్దుబాటు చేయాలని ఆదేశం
- అలా అయితే తమకు టికెట్ వద్దంటోన్న సీనియర్ నేత
- చంద్రబాబు, లోకేశ్ తీరుపై పచ్చ నేతల మండిపాటు

సాక్షి, పుట్టపర్తి

సార్వత్రిక ఎన్నికల వేళ టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ ‘క్యాష్’ పాలిటిక్స్‌కు తెరలేపారు. ఎంతమంది వ్యతిరేకించినా.. ఎన్ని ఫిర్యాదులు అందినా.. డబ్బు సంచులతో వచ్చిన వారందరికీ ఈసారి అసెంబ్లీ టికెట్లు ఇచ్చారు. డబ్బులివ్వలేము బాబూ అన్న వారందరికీ ఐవీఆర్ఎస్ సర్వేను సాకుగా చూపి నేనూ టికెట్లు ఇవ్వలేనని తేల్చి చెప్పారు. టీడీపీలో జరుగుతున్న టికెట్ల అమ్మకాల వ్యవహారంపై తెలుగు తమ్ముళ్లు మండిపడుతున్నారు. ‘ఎలాగూ గెలిచే పరిస్థితి లేదు. టికెట్ల ద్వారా వచ్చినకాడికి దండుకుందాం’ అని చంద్రబాబు అనుకుంటున్నారని



కొందరు టీడీపీ నేతలే బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

సీనియర్ వద్ద డబ్బు దండుకుని...

జిల్లాలోనే కీలకమైన ఓ అసెంబ్లీ టికెట్ విషయంలో పలు విషయాలు వెలుగు చూస్తున్నాయి. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత వద్ద డబ్బులు భారీగా దండుకుని ఆయన కుటుంబీకులకు చంద్రబాబు టికెట్ ఇచ్చారని టీడీపీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ సదరు నేతకు, కుటుంబీకులకు ఎవరికి సీటిచ్చినా ఘోరంగా ఓటమి ఖాయమని సర్వేలు, పార్టీ నేతలు నెత్తీనోరూ కొట్టుకున్నా చంద్రబాబు మాత్రం... సదరు నేత కుటుంబీకులకే టికెట్ ఇవ్వడం టీడీపీ నేతల వ్యాఖ్యలకు బలం చేకూరుస్తోంది. అయితే తాజాగా మరో కొత్త కోణం వెలుగు చూసింది. సదరు సీనియర్ నేత తన నియోజకవర్గంతో పాటు మరో రెండు నియోజకవర్గాల ఖర్చు భరించాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో తమకు టికెట్ వద్దని ఆ టీడీపీ నేత కుటుంబ సభ్యులు అధిష్టానానికి చెప్పినట్లు తెలిసింది. ఇతర నియోజకవర్గాలకు తామెందుకు డబ్బులు ఖర్చు చేయాలని సదరు నేత కుమారుడు ప్రశ్నించినట్లు సమాచారం.

సీటు త్యాగానికైనా సిద్ధమట..

ఒక సీటిచ్చి మూడు నియోజకవర్గాల ఖర్చు భరించాలంటే తమ వల్ల కాదని సదరు సీనియర్ నేత కుటుంబీకులు తేల్చేశారు. కాదు.. కూడదంటే... తమ సీటు కూడా వదలుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. బీసీ వర్గాల నుంచి భారీ వ్యతిరేకత ఏర్పడుతున్న తరుణంలో పోటీ నుంచి తప్పుకోవడమే మంచిదనే నిర్ణయానికి సదరు సీనియర్ నేత కుటుంబీకులు వచ్చినట్లు తెలుగు తమ్ముళ్లు చెబుతున్నారు.

ఓటమి భయంతోనే..

సదరు టీడీపీ సీనియర్ నేత గతంలో ప్రాతినిధ్యం వహించిన స్థానంతో పాటు జిల్లాలో ఎక్కడా టీడీపీ గెలిచే పరిస్థితులు లేవు. దీంతో డబ్బు ఎరగా వేసి ఓటర్లను ప్రలోభాలకు గురి చేయాలని అధినేత చంద్రబాబు భావిస్తున్నారు. ఈక్రమంలోనే సదరు టీడీపీ సీనియర్ నేత ద్వారా డబ్బులు లాగి.. మిగతా సీట్లకు సర్దాలనే స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది.

రెబల్స్ బెడద..

సీనియర్ నాయకులు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, నిమ్మల కిష్టప్ప తమకు ప్రాధాన్యం ఇవ్వలేదని అధిష్టానంపై అలకబూనారు. అవసరమైతే స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగి టీడీపీ అభ్యర్థులను ఓడించేందుకు వారంతా ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పుట్టపర్తి, పెనుకొండ నేతలు కొందరు గోరంట్లలోని నిమ్మల కిష్టప్ప నివాసంలో రహస్యంగా సమావేశమై చర్చించారు. ఈ పరిణామాల నేపథ్యంలో టీడీపీ అభ్యర్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

మడకశిర సబ్ రిజిస్ట్రార్‌కు రిమాండ్



జనం లేక వెలవెలబోతున్న మడకశిర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

- సహకరించిన డాక్యుమెంట్ రైటర్‌కూ జైలు
- బుధవారం ఉదయం 10 వరకూ కొనసాగిన ఏసీబీ సోదాలు
- కార్యాలయంలోని పలు రికార్డుల పరిశీలన

మడకశిర: అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఓ రైతు నుంచి రూ.2.50 లక్షలు లంచంగా తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయిన మడకశిర సబ్ రిజిస్ట్రార్ దామోదర్‌రెడ్డికి, అతనికి సహకరించిన డాక్యుమెంట్ రైటర్ షమీవుల్లాకు కర్నూలు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. వివరాల్లోకి వెళితే.. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో సబ్ రిజిస్ట్రార్ దామోదర్‌రెడ్డి తన కార్యాలయంలోనే మండలంలోని గంతలపల్లికి చెందిన హనుమంతరెడ్డి అనే రైతు నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ దామోదర్‌రెడ్డి సమక్షంలోనే బుధవారం ఉదయం 10 గంటల వరకూ కార్యాలయంలోని పలు రికార్డులు తనిఖీ చేశారు. దామోదర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి జరిగిన భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించారు. ఇందులో కొన్నింటిని స్వాధీనం చేసుకున్నారు. ప్రతి డాక్యుమెంట్‌కు సంబంధించిన వివరాలను సబ్‌రిజిస్ట్రార్ నుంచే సేకరించినట్లు తెలిసింది. ఆ తర్వాత సబ్‌రిజిస్ట్రార్ దామోదర్‌రెడ్డి, డాక్యుమెంట్ రైటర్ షమీవుల్లాను కర్నూలు ఏసీబీ కోర్టుకు తరలించగా, న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు.

వెలవెలబోయిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

ఏసీబీ అధికారుల దాడుల నేపథ్యంలో నిత్యం రద్దీగా ఉండే మడకశిర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం బుధవారం వెలవెలబోయింది. డాక్యుమెంట్ రైటర్‌ను కూడా అధికారులు అదుపులోకి తీసుకోవడంతో స్థానిక డాక్యుమెంట్ రైటర్లు ఎవరూ పరిసర ప్రాంతాల్లో కనిపించలేదు. మరోవైపు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు బుధవారం ప్రజలు కూడా ఎవరూ రాకపోవడంతో కార్యాలయం బోసిపోయింది.

గుడ్లు తేలేస్తున్న కోళ్లు

- భానుడి భగభగ.. కోళ్లు విలవిల
- భారీగా చనిపోతున్న వైనం
- 20 శాతం పడిపోయిన కోడిగుడ్ల ఉత్పత్తి
- ఆందోళన చెందుతున్న పౌల్ట్రీ యజమానులు



కొక్కొరొకో అంటూ తెల్లవారుజామున నిద్ర లేపిన కోడి... మధ్యాహ్నం వేళకు గుడ్లు తేలేస్తోంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా కోళ్లు పిట్టల్లా రాలిపోతున్నాయి. ఉష్ణోగ్రత ప్రభావం గుడ్ల ఉత్పత్తిపైనా చూపుతోంది. దీంతో చికెన్, కోడిగుడ్ల ధరలు అమాంతం పెరిగాయి.

నెల రోజులుగా చికెన్ ధరలు ఇలా..

తేదీ	లైవ్ చికెన్	స్కిన్ అవుట్
15.2.24	రూ.140	రూ.170
20.2.24	రూ.145	రూ.180
25.2.24	రూ.150	రూ.184
05.3.24	రూ.165	రూ.190
18.3.24	రూ.180	రూ.220

హిందూపురం అర్బన్: భానుడి భగభగలతో పౌల్ట్రీ పరిశ్రమ విలవిల్లాడుతోంది. జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు మార్చిలోనే 40 డిగ్రీల మార్క్‌ను దాటాయి. రానున్న రోజుల్లో 45 డిగ్రీలకు చేరే అవకాశం ఉన్నట్లు వాతావరణ విభాగం అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితులు పౌల్ట్రీ రంగాన్ని కుదేలు చేస్తోంది.

పెరిగిన కోళ్ల మరణాలు..

మామూలు రోజుల్లో కోళ్ల మరణాల రేటు 1 నుంచి 2 శాతం ఉంటాయి. కానీ పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రస్తుతం 8 నుంచి 10 శాతానికి పెరిగింది. అంతే కాక గుడ్ల ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గుతోంది. అధిక ఉష్ణోగ్రతలతో 25 శాతం మేర గుడ్ల ఉత్పత్తి క్షీణించిందని పౌల్ట్రీ నిర్వాహకులు చెబుతున్నారు. ఎండలతో కోళ్లు ఎక్కువగా నీళ్లు తాగడం, మేత తక్కువగా తినడం వల్ల గుడ్ల ఉత్పత్తి తగ్గిపోతోందంటున్నారు. అందువల్లే చాలా పౌల్ట్రీ ఫాంలలో నిర్వాహకులు చల్లదనం కోసం స్ప్రింక్లర్లు ద్వారా నీటిని స్ప్రే చేస్తున్నారు. దీంతో కోళ్లు కాస్త ఉపశమనం కలుగుతోంది. గడచిన 10 ఏళ్లలో ఇంత పెద్ద మొత్తంలో నష్టాలు చవి చూడలేదని చిలమత్తూరుకు చెందిన పౌల్ట్రీ యజమాని అశ్వర్థప్ప తెలిపారు.

పెరుగుతున్న చికెన్, కోడిగుడ్ల ధరలు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 52 వరకు లేయర్ ఫారాలున్నాయి. వీటిలో గుడ్లు పెట్టే కోళ్లు 30 లక్షల కుపైగా ఉంటాయి. రోజూ 2.50 లక్షల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. అలాగే వివిధ బ్రాయిలర్ ఫారాల్లో 1.60 కోట్ల కోళ్లు పెరుగుతున్నాయి. పెరిగిన ఉష్ణోగ్రతలతో కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గి పోవడం, ఫారాల్లో కోళ్లు చనిపోవడం వల్ల ఇటు గుడ్లు, అటు చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. నెల రోజులుగా కోడిగుడ్ల ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో వంద కోడిగుడ్ల ధర రూ. 520 నుంచి రూ.550 వరకూ పలుకుతున్నాయి. మరోవైపు చికెన్ (లైవ్) కిలో రూ.160 నుంచి రూ.180 వరకు పలుకుతోంది. స్కిన్ అవుట్ రూ.210 నుంచి రూ.220 వరకు చేరింది. ఇక వంద గుడ్లపై రూ.30, కిలో చికెన్‌పై రూ.20 మేర ధర పెరిగింది. రానున్న రెండు, మూడు నెలలూ ఇదే పరిస్థితి ఉంటుందని పౌల్ట్రీ రంగ నిపుణులు చెబుతున్నారు.



మార్కెట్‌లో అమ్మకానికి కోడి గుడ్లు

క్లుప్తంగా

ఏడీహెచ్ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీడీ పెంచలయ్య

లేపాక్షి: స్థానిక పశుసంవర్ధక సహాయ సంచాలకుల కార్యాలయాన్ని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పెంచలయ్య బుధవారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మందులు కొరత, ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. వేసవిలో పశువులకు సంక్రమించే వ్యాధులపై రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు అసిస్టెంట్ డైరెక్టర్ మోహన్, వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

రైలు ఢీకొని విద్యార్థి మృతి



పవన్ (ఫైల్)

కదిరి టౌన్: రైలు ఢీకొన్న ఘటనలో ఓ విద్యార్థి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... నంబూలపూలకుంట మండలం వంకమద్ది గ్రామానికి చెందిన బెస్త పవన్ (17)... తిరుపతిలోని చైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి మూడు రోజుల క్రితం తలుపుల మండలం ఎగువపేటలోని మేనమామ ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం కదిరికి వచ్చిన పవన్... మధ్యాహ్నం హెడ్‌ఫోన్లు పెట్టుకుని ఫోన్‌లో మాట్లాడుకుంటూ ఆర్టీఓ కార్యాలయం వెనుక ఉన్న పట్టాల పైకి చేరుకున్నాడు. ఆ సమయంలో అటుగా ముంబయి నుంచి నాగర్‌కోయిల్‌కు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు వస్తున్న విషయం గమనించకుండా పట్టాల మధ్యలో పవన్ నడుచుకుంటూ వెళ్లసాగాడు. విషయం గమనించిన లోకో పైలెట్ హారన్ మోగించినా ఫలితం లేకపోయింది. ఈ లోపు రైలు ఢీకొనడంతో పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రులు బతుకు తెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లినట్లు సమాచారం. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే ఎస్ఐ రహీమ్ తెలిపారు.

మినహాయింపునకు ఆధారాలు చూపండి

కొత్తచెరువు: ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కోరుకున్న బోధన, బోధనేతర ఉద్యోగులు వెంటనే సరైన ఆధారాలను సమర్పించాలని డీఈఓ మీనాక్షి కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మినహాయింపు కోరిన ఉద్యోగుల జాబితా సిద్ధమవుతున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించి సరైన ధ్రువీకరణ పత్రాలను రెండు రోజుల్లోపు డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ప్రజల ముంగిటకే వైద్యసేవలు

- సమాచారం అందుకున్న వెంటనే స్పందిస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది
- 104 వాహనాలతో ఇంటి వద్దకే నాణ్యమైన వైద్యం
- వైఎస్సార్ అంబులేటరీతో మెరుగైన పశువైద్యం
- జిల్లా వ్యాప్తంగా అందుబాటులో 82 వాహనాలు



108లో పసిబిడ్డకు జన్మనిచ్చిన తాడిమర్రికి చెందిన మహిళ (ఫైల్)



వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వద్ద నిలిపిన 104 వాహనం

పుట్టపర్తి అర్బన్: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పల్లె ప్రజలకు ఆరోగ్య సేవలు మరింత చేరువయ్యాయి. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను అప్‌గ్రేడ్‌చేస్తూ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లుగా ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో మెరుగైన అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. గత ప్రభుత్వంలో ఆరోగ్య ఉపకేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అంతంత మాత్రంగానే వైద్య సేవలు అందాయి. ఓ వైపు సిబ్బంది కొరత... మరోవైపు మౌలిక వసతులు లేక రోగులు ఇబ్బంది పడుతూ వచ్చారు. చిన్నపాటి వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించే వారు. రోగుల వెతలను తన పాదయాత్రలో గమనించిన అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'నేను విన్నాను... నేను ఉన్నాను' అంటూ అధికారం చేపట్టగానే ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ వచ్చారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రజలకు వారున్న ప్రాంతాలకు సమీపంలోనే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. అంతేగాక ఎక్కడో దూరాన ఉన్న తండాల్లోని గిరిజనులకు సైతం అన్ని రకాల వైద్య పరీక్షలతో కూడిన మెరుగైన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి.

'108'కు పునర్జీవం..

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పురుడు పోసుకున్న 108 అంబులెన్స్ వ్యవస్థ కొన్ని లక్షల మందికి ప్రాణదానం చేసింది. ఫోన్ చేసిన 20 నిమిషాల్లోపు బాధితుల వద్దకు చేరి తక్షణ వైద్య సహాయాన్ని అందించి, సమీపంలోని వైద్యశాలకు తరలించడంలో 108 సంజీవనిలా పని చేసింది. కోట్లాది మందికి చేరువైన ఈ సేవలను తెలుసుకున్న దేశంలోని పలు రాష్ట్రాల ప్రభుత్వాల కూడా అనుసరించాయి. మహానేత మరణం తర్వాత అటు కాంగ్రెస్ సర్కార్, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం 108 వ్యవస్థని నామరూపాల్లేకుండా చేశాయి. సిబ్బంది బాగోగులు పట్టించుకోలేదు. 2019లో జగన్ సర్కార్ ఏర్పాటైన తర్వాత 108 అంబులెన్స్ సేవలకు జీవం పోస్తూ మరిన్ని వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. వాహనాన్ని ఓ చిన్నపాటి ఆస్పత్రిలా మార్చేశారు.

ఏటా 59,860 మందికి వైద్యసేవలు..

ప్రజలకు ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా తక్కునా గుర్తుకు వచ్చి ఆదుకోవడంలో 108 అంబులెన్స్ ముందు వరసలో ఉంటోంది. ప్రతి వాహనంలోనూ ఇద్దరు టెక్నీషియన్లతో పాటు ఇద్దరు డ్రైవర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ వాహనం ద్వారా జిల్లాలో ఏటా సగటున 59,860 మందికి వైద్య సేవలు అందుతున్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలను సకాలంలో ఆస్పత్రికి చేర్చి మాతాశిశు మరణాల శాతాన్ని గణనీయంగా తగ్గించడంతో 108 అంబులెన్స్ సిబ్బంది చూపిస్తున్న చొరవ అభినందనీయం. దీంతో పాటు రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లోనే సమీపంలోని ఆస్పత్రులకు చేరుస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 33 వాహనాలు అందుబాటులో ఉండగా, ఇందులో 132 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

మారుమూల గ్రామాలకు ఆధునాతన వైద్యసేవలు..

గ్రామాల్లో మంచానికే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులతోపాటు అనారోగ్య బాధితులకు 104 వాహనాల సంచార వైద్యసేవలు వరంలా మారాయి. ఎటూ వెళ్లాల్సిన అవసరం లేకుండానే సొంతూరులోనే మెరుగైన చికిత్స చేయించుకుంటున్న పరిస్థితులను జగన్ సర్కార్ కల్పించింది. జిల్లా వ్యాప్తంగా 104 వాహనాలు 36 ఉన్నాయి. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో గ్రామాల్లో ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4.30 వరకు 104 వాహనం అందుబాటులో ఉంటుంది. 104 వైద్యుడితోపాటు సంబంధిత పీహెచ్‌సీ డాక్టర్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్త అక్కడే ఉంటారు. మధ్యాహ్నం వరకు ఆయా గ్రామాల సచివాలయాల వద్ద రోగులకు వైద్యసేవలందిస్తున్నారు. దీర్ఘకాలిక రోగులకు ఉచితంగా మందులు అందజేస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందజేస్తున్నారు. అనంతరం నడవలేని వారు, మంచాన పడిన వృద్ధులు, దివ్యాంగులు, ఇతర రోగులకు ఇళ్లవద్దకే వెళ్లి సేవలందిస్తున్నారు. 104లో ఉండే డేటా ఎంట్రీ ఆపరేటర్ ప్రతి రోగి వివరాలను ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డులో పొందుపరిచి, భవిష్యత్‌లో మెరుగైన వైద్యసేవలందించేలా చర్యలు తీసుకుంటున్నారు. రోగికి మెరుగైన వైద్యసేవలు అవసరమైతే పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రులు, ఆరోగ్య నెట్‌వర్క్ ఆస్పత్రిలకు రెఫర్ చేస్తున్నారు. ఈ వాహనాల ద్వారా గత ఏడాది 1,05,000 మంది వైద్య సేవలు అందుకున్నట్లు రికార్డులు చెబుతున్నాయి.

ఇంటి వద్దకే పశువైద్యం..

రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకున్న రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ సంచార పశు వైద్య (వైఎస్సార్ మొబైల్ అంబులేటరీ క్లినిక్) సేవలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. జిల్లాల మొత్తం 13 వాహనాలు అందుబాటులో ఉండగా, ఒక్కో వాహనంలో ఓ డాక్టర్, అసిస్టెంట్, డ్రైవర్‌తో ముగ్గురు చొప్పున పనిచేస్తుంటారు. 108 తరహాలోనే 1962కు ఫోన్ చేసిన అరగంటలోపే పాడి రైతుల ఇంటి ముంగిటకే వాహనంతో పాటు సిబ్బంది చేరుకొని పశువులు, జీవాలకు నాణ్యమైన వైద్య సేవలు అందజేస్తున్నారు. గత ఏడాది సుమారు 95 వేల పశువులు, జీవాలకు అత్యవసర వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడారు.



పశువైద్యంలో వినియోగిస్తున్న వాహనం

కూతురి కోసం తల్లి ఆరాటం

- మైనర్ బాలికను ఎత్తుకెళ్లిన యువకుడు
- పోలీసు స్టేషన్ ఎదుట తల్లి ఆందోళన



కళ్యాణదుర్గం పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించిన త్రివేణిదేవి

కళ్యాణదుర్గం: ఓ తల్లి తన కుమార్తె కోసం మిట్ట మధ్యాహ్నం మండుటెండలో గంటల తరబడి బైఠాయించింది. 15 రోజుల క్రితం కనిపించకుండా వెళ్లిన తన కుమార్తె ఆచూకీ పసిగట్టడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేసింది. వివరాలు... కళ్యాణదుర్గంలోని డీఎస్పీ పాత కార్యాలయ సమీపంలో నివాసముంటున్న ఓ 17 ఏళ్ల బాలికను అదే ప్రాంతంలో నివాసముంటున్న యువకుడు రాజు ఎత్తుకెళ్లాడు. దీనిపై 15 రోజుల క్రితమే బాలిక తల్లి త్రివేణిదేవి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి రోజూ పోలీసు స్టేషన్ చుట్టూ తిరిగినా కుమార్తెను గురించిన ఏ వివరాలు తెలియరాలేదు. బుధవారం ఉదయం మరోసారి పట్టణ పోలీసులను కలిసి కుమార్తె ఆచూకీ కోసం ఆరా తీసింది. ఎలాంటి స్పందన లేకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె స్టేషన్ ఎదుట బైఠాయించి తన కుమార్తె ఆచూకీ తెలపాలంటూ పోలీసులను వేడుకుంది. తన కుమార్తెను మాయమాటలతో లోబర్చుకుని అపహరించుకెళ్లిన రాజు, అతని కుటుంబసభ్యులు చిత్రహింసలకు గురి చేస్తూ వీడియోలు సైతం పంపిస్తున్నారని కన్నీరుమున్నీరుగా రోదించింది. తన ఫిర్యాదును నిర్వీర్యం చేసేలా పోలీసులను సైతం రాజు తరపున కుటుంబసభ్యులు, బంధువులు ప్రభావితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తన కుమార్తెను తన వద్దకు చేర్చకపోతే ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదంటూ విలపించింది.

కృష్ణాజలాలు అందించిన ఘనత జగన్‌దే



మాట్లాడుతున్న వజ్ర భాస్కరరెడ్డి

కదిరి అర్బన్: రాయలసీమకు కృష్ణా జలాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కరరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల హంద్రీ-నీవా జలాలకు సంబంధించి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌తో పాటు ఆ పార్టీ జిల్లా నాయకులు చేసిన ఆరోపణలను ఖండించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన చేతగానితనంతో చిత్తూరు జిల్లాకు హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకెళ్లలేకపోయారన్నారు. శ్రీశైలం నుంచి 477 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పానికి కృష్ణా జలాలు తీసుకెళ్లిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం గణనీయంగా తగ్గినా ఆరు నెలల పాటు ఎత్తిపోతల పథకం ద్వారా జీడిపల్లికి నీటిని విడుదల చేసి రాయలసీమ జిల్లాలకు మళ్లించారని గుర్తు చేశారు. హంద్రీ-నీవా కాలువతో భూగర్భ జలాలు పెరిగి జిల్లాలో 2 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయన్నారు. తలుపుల, ఎన్పీకుంట మండలాలకు హంద్రీ-నీవా నీటిని ఇవ్వాలన్న సంకల్పంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పంకు వెళ్లే నీటిని నాలుగు రోజుల పాటు ఆపేశారని, దీంతో తలుపుల మండలానికి 16 కిలోమీటర్ల వరకు నీరు వచ్చాయని గుర్తు చేశారు. ప్రస్తుతం జరగబోయే ఎన్నికల్లో చంద్రబాబు, బాలకృష్ణను ఓడించేది కూడా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డేనని ధీమా వ్యక్తం చేశారు. మొత్తం 175 నియోజకవర్గాల్లోనూ వైఎస్సార్‌సీపీ గెలుస్తుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు జిలాన్, ఎస్టీ సెల్ నాయకులు కృష్ణానాయక్ పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం

- ఏప్రిల్ 25 వరకు గడువు
- కొత్త ఓటర్లకు మాత్రమే

రాయదుర్గంటౌన్: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. నామినేషన్ల చివరి రోజు అంటే ఏప్రిల్ 25వ తేదీ వరకూ అవకాశం ఉంటుందని ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజున రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి ముఖేష్ కుమార్‌మీనా వెల్లడించారు. అయితే ఓట్ల తొలగింపు, మార్పులు, చేర్పులకు అవకాశం ఉండబోదు. కేవలం కొత్తగా ఓటరు నమోదు (ఫారం6)కు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో 18 ఏళ్లు నిండిన వారే కాక ఇప్పటి వరకూ ఓటు హక్కు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓటు వేసి వినియోగించుకునే అవకాశం కల్పిస్తారు. ఐదేళ్ల పాటు ప్రజలను పాలించే వారిని ఎన్నుకోవడంలో ఓటు హక్కు కీలకం కానుంది. అర్హులు నిర్లక్ష్యం చేయకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఆన్‌లైన్ లేదా, తహసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల విభాగంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

బీసీ హాస్టల్ వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటేష్



వెంకటేష్‌ను సన్మానిస్తున్న బీసీ హాస్టల్ వార్డెన్లు

కనగానపల్లి: బీసీ సంక్షేమ హాస్టల్ వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కనగానపల్లి బీసీ హాస్టల్ వార్డెన్ వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పుట్టపర్తిలో జరిగిన హాస్టల్ వార్డెన్‌ల జిల్లా కమిటీ సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. ఈ మేరకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లలితాదేవి తెలిపారు. తనను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కమిటీ సభ్యులకు వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

కదిరి అర్బన్: మైనర్‌ను పెళ్లి చేసుకున్న వ్యక్తిపై ఆయన మొదటి భార్య ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... కదిరి మండలం మాచిరెడ్డిపల్లికి చెందిన భార్గవకు మూడేళ్ల క్రితం మాధవితో వివాహమైంది. గత డిసెంబర్‌లో అదే గ్రామానికి చెందిన ఓ బాలికను భార్గవ రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆలస్యంగా ఈ విషయం తెలుసుకున్న మాధవి... కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం భార్గవపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీని వీడం

- విలేకరుల సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు



మాట్లాడుతున్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

గాండ్లపెంట: ఎలాంటి పరిస్థితుల్లోనూ తాము వైఎస్సార్‌సీపీని వీడిపోబోమని, సీఎం వైఎస్ జగన్ వెంటే తామంతా ఉంటామని గాండ్లపెంట మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న అంశాన్ని ఖండిస్తూ బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమకు రాజకీయ భిక్ష పెట్టిన సీఎం వైఎస్ జగన్ మేలును ఎన్నటికీ మరవబోమన్నారు. జరగబోయే ఎన్నికల్లో కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మక్బూల్‌అహ్మద్‌ను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. టీడీపీ హయాంలో ప్రజలకు చేసిన ఒక్క మంచి పని కూడా చంద్రబాబు చేయలేదన్నారు. గ్రామాల్లో ప్రచారానికి వెళితే ప్రజలే స్వచ్ఛందగా 'ఫ్యాన్' గుర్తుకు ఓటు వేస్తామని బాహాటంగానే చెబుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సముచిత స్థానం కల్పించి సామాజిక న్యాయం చేకూర్చిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా టీడీపీ వాడుకుందన్నారు. మైనారీలకు కనీసం మంత్రి పదవి కూడా ఇవ్వకుండా చంద్రబాబు మోసం చేశారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీటీసీలు ఇక్బాల్ ఖమర్‌జహాన్, గోపాల్ లక్ష్మీదేవి, శ్రీరాములు గంగోజమ్మ, సర్పంచ్‌లు రహంతుల్లా, రమణ, ఉత్తన్న, నాగభూషణంరెడ్డి, జి.ఆంజనేయులు, అబ్బా ఆంజనేయులు, పోతినేని చలపతి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఫయాజ్ అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు హైదర్‌వలి, జేసీఎస్ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, బీసీ కన్వీనర్ నరసింహగౌడ్, యూత్ కన్వీనర్ గజ్జల లోకేశ్వరరెడ్డి, మైనార్టీ కన్వీనర్ బహువుద్దీన్, మండల మాజీ కో-ఆప్షన్ సికిందర్, ఆర్బీకే అధ్యక్షుడు శంకరనాయుడు, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్లు పురుషోత్తంరెడ్డి, ఫారూక్, ఆంజనేయులు నాయక్, బాలకృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీలో సీట్ల మార్పిడి

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులకు సీట్లు మార్చారు. ఈ మేరకు సీఈఓ వైఖోమ్ నిదియాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సజావుగా సాగేలా కీలక సీట్ల విషయంలో మార్పు, చేర్పులు చేసినట్లు తెలుస్తోంది. డిప్యుటేషన్‌పై వచ్చిన ఏఓ హరినాథ్‌కు ఎ సెక్షన్ వ్యవహారాలు అప్పగించారు. సీనియర్ అసిస్టెంట్ కేశవకు ఏ1, ఏ4 కారుణ్య నియామకాల సీటు కేటాయించారు. మరో సీనియర్ అసిస్టెంట్-శ్రీనివాసులు... ఏ2, ఎలక్ట్రిసిటీ, టెలిఫోన్ బిల్లులు, శానిటరీ ఐటమ్స్, బిల్లులు చూస్తారు. ఏఓ-ఉషారాణికి 'కె' సెక్షన్ బాధ్యతలు అప్పగించారు. ఏఓ ధనుంజయనాథ్‌కు 'ఐ' సెక్షన్, ఏఓ హనుమంతరెడ్డికి 'హెచ్' సెక్షన్, ఇంకో ఏఓ నాగేంద్రకుమార్‌కు 'ఎల్' సెక్షన్ బాధ్యతలు అప్పగించారు. సీఈఓ సీసీగా పని చేసిన ఇమ్రాన్‌కు జీ2, రాఘవేంద్రుడుకు ఐ-4, 5 విభాగాలు అప్పగించారు. బుధవారం నుంచి ఆయా సీట్లలో వారు బాధ్యతలు స్వీకరించారు.

భార్య కాపురానికి రాలేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న బసవరాజు

రొళ్ల: భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన వ్యక్తి పురుగుల మందు తాగాడు. వివరాలు... రొళ్ల మండలం రత్నగిరిగొల్లహట్టి గ్రామానికి చెందిన మూడ్లప్ప, మారక్క దంపతుల కుమారుడు బసవరాజుకు కర్ణాటకలోని మదుగిరి తాలూకా ఐడీహళ్లి హోబళి బ్రహ్మసంద్ర గ్రామానికి చెందిన నింగమ్మతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల పుట్టింటికి వెళ్లిన నింగమ్మ 15 రోజులు కావస్తున్నా తిరిగి రాలేదు. దీంతో బుధవారం ఉదయం భార్యకు బసవరాజు ఫోన్ చేసి కాపురానికి రావాలని బతిమలాడాడు. ఆ తర్వాత ఫోన్ కట్టేసి తీవ్ర మనోవేదనతో నేరుగా పొలానికి చేరుకుని పూల తోటకు ఉపయోగించే క్రిమి సంహారక మందును తాగేందుకు ప్రయత్నించాడు. విషయం గమనించిన అక్కడే ఉన్న గ్రామస్తులు వెంటనే అప్రమత్తమై పురుగుల మందు బాటిల్‌ను లాక్కొని పడేశారు. అప్పటికే గొంతులోకి క్రిమి సంహారక మందు వెళ్లింది. దీంతో కుటుంబసభ్యులు వెంటనే రొళ్లలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మేఘన మృతికి కారకులను అరెస్ట్ చేయాలి

- కుటుంబ సభ్యుల డిమాండ్

రొళ్ల: మండలంలోని కాకి గ్రామంలో మంగళవారం ఉదయం మేఘన (20) అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె మృతికి కారకులను అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలంటూ బుధవారం బాధిత కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం మేఘన మృతదేహాన్ని బుధవారం కాకి గ్రామానికి తరలించారు. ఆమె మృతికి మంజునాథ్ అనే యువకుడే కారణమని మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపిస్తూ, తక్షణమే మంజునాథ్‌ను అరెస్ట్ చేయాలంటూ ఆందోళన చేపట్టారు. అంత్యక్రియలు జరపకుండా ఆపివేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. రెండేళ్లుగా మేఘనను మంజునాథ్ వేధింపులకు గురి చేస్తూ వస్తున్నాడని బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. మందలించినా అతనిలో మార్పు రాకపోవడంతో మేఘనను బెంగళూరుకు పంపామన్నారు. చెల్లెలు వరలక్ష్మి పదో తరగతి పరీక్షలు రాస్తుండడంతో ధైర్యం చెప్పేందుకు మంగళవారం గ్రామానికి వచ్చిన మేఘన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో చొరబడిన మంజునాథ్... ఆ తర్వాత కాసేపటికే మేఘన మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చి పడుకోబెట్టాడని తెలిపారు. తమ కుమార్తెను మంజునాథే హతమార్చి ఉంటాడని అనుమానాలు వ్యక్తం చేస్తూ మేఘన తల్లి రాధమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయడంతో ఆందోళన విరమించి, అంత్యక్రియలు జరిపారు.

నిధి పోర్టల్ ద్వారానే ఏపీజీఎల్ఐ కార్యకలాపాలు

అనంతపురం సిటీ: అన్ని శాఖల ఉద్యోగులకు సంబంధించిన ఏపీజీఎల్ఐ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా) వ్యవహారాలన్నీ ఇకపై నిధి పోర్టల్ ద్వారానే ఆన్‌లైన్‌లో కొనసాగుతాయని ఆ శాఖ అనంతపురం డిప్యూటీ డైరెక్టర్ భాస్కర్ తెలిపారు. ఇప్పటికే ఉద్యోగుల పాలసీ, స్వీకరించిన ప్రీమియం, పొందిన రుణాల వివరాలను నిధి పోర్టల్‌కు బదిలీ చేసినట్లు వివరించారు. ఏపీజీఎల్ఐ పాలసీ తీసుకున్న ఉద్యోగులు, రుణాలు పొందిన వారు పోర్టల్‌లోని డేటాను పరిశీలించి ధ్రువీకరించుకోవాలన్నారు. పాలసీవారీగా డేటా ముద్రించిన కాపీలు ఆయా శాఖల డీడీఓల ద్వారా పొందవచ్చునన్నారు. పాలసీ డేటాలో అభ్యంతరాలు ఉంటే ఏప్రిల్ 30లోపు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గడువులోపు ఎలాంటి అభ్యంతరాలు తెలపకపోతే నిధి పోర్టల్‌లో ఉంచిన డేటాను కచ్చితమైనదిగా పరిగణిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ఏపీజీఎల్ఐ చందాదారులు నిబంధనల మేరకు పాలసీ ఖాతాలను సరి చూసుకోవాలని కోరారు.

కలుషిత గడ్డి తిని జీవాలు మృతి

గుమ్మఘట్ట: కలుషిత గడ్డి తిన్న 29 జీవాలు మృత్యువాత పడ్డాయి. స్థానికులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన గొల్ల తమ్మన్న, గొల్ల రామకృష్ణ, శివలింగ, కొత్తపల్లి రామకృష్ణ... గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తమ జీవాలను మేపునకు తోలుకుని అటవీ ప్రాంతానికి బయలుదేరారు. మార్గమధ్యంలో అదే గ్రామానికి చెందిన రైతు కృష్ణమూర్తి తోటలోకి ప్రవేశించిన జీవాలు బీడు భూమిలోని గడ్డిని తిన్నాయి. ఆ తర్వాత ఒక్కొక్కటిగా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి నవీన్‌కుమార్ అక్కడకు చేరుకుని చికిత్స మొదలు పెట్టారు. ఈ లోపు ఓ ఆవుతో పాటు 15 గొర్రెలు, 13 మేకలు మృతి చెందాయి. తోటలో కలుపు నివారణకు సంబంధించి మందు పిచికారీ చేసినట్లుగా తెలిసింది. మరో 20 గొర్రెలు, మేకలు మృత్యువుతో పోరాడుతున్నాయి. ఘటనతో రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరులు వాపోయారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి వెంటనే స్పందించారు. ఫోన్ ద్వారా బాధితులను పరామర్శించి అండగా ఉంటామని భరోసానిచ్చారు.